


బేరానికి నంద్యాల ఎంపీ టికెట్



- రూ.120 కోట్లు ఇస్తేనే టికెట్
- సీటుకు రేటు కట్టిన వైసీపీ
- పైసలిస్తేనే టికెట్ అని తేల్చిచెప్పిన అధిష్ఠానం
- మొదట తూగలేక వద్దనుకున్నా.. చివరకు సరేనన్న ఎంపీ పోచా?

నంద్యాల, ఆంధ్రజ్యోతి:

ఎన్నికలంటే ప్రజలు ఓట్లు వేయడం, ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులు గెలవడం, వాళ్లు ప్రజా సమస్యలు పరిష్కరించడం అనే ప్రజాస్వామిక విలువలు అడుగంటిపోయాక సీట్లు కోట్ల రూపాయలు పలుకుతున్నాయి. ప్రజాబలంతో గెలవాల్సిన సీట్లు వందల కోట్ల పందేరంగా మారిపోయాయి. దీనికి నంద్యాల ఎంపీ టికెట్ ఉదాహరణ. రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉన్న నంద్యాల ఎంపీ సీటుకు వైసీపీ భారీ మొత్తంలో రేటు కట్టింది. ఏకంగా రూ.120 కోట్లు ఫిక్స్ చేసింది. ఈ డబ్బు ఎవరిస్తే వాళ్లకే అని బేరం పెట్టేసింది. ప్రస్తుతం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ముందు ఆ పార్టీ అధినాయకత్వం ఈ బేరం పెట్టింది. దానికి ఆయన తాను అంతకు తూగలేనని తెలిపినట్లు సమాచారం. అయినా వైసీపీ నాయకత్వం వెనక్కి తగ్గలేదు. టికెట్ ధర తగ్గించలేదు. దీంతో పోచా కొద్ది రోజులు మిన్నకుండిపోయారు. ఈ దశలో నంద్యాల ఎంపీ సీటును వైసీపీ మైనారిటీలకు కేటాయిస్తోందనే ప్రచారం కూడా జరిగింది. కొద్ది రోజులయ్యాక పోచా పునరాలోచనలో పడ్డారని తెలుస్తోంది. ఎంత ధర అయినా టికెట్ కొనుక్కోకపోతే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని, దీంతో రాజకీయ భవిష్యత్తు గందరగోళంలో పడిపోతుందని భావించారు. ఎట్లకేలకు రూ.120 కోట్లు ఇచ్చి నంద్యాల ఎంపీ టికెట్ కొనుక్కోవడానికి సిద్ధపడ్డట్లు తెలుస్తోంది.

ఆ మంత్రితో చెప్పించినా..

మూడు నెలల కిందట జగన్ సన్నిహితుడైన చిత్తూరు జిల్లాకు చెందిన మంత్రి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నంద్యాలకు వచ్చారు. ఆ సమయంలో ఎంపీ పోచా ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో కూడా తనకే ఎంపీ సీటు ఇప్పించాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే టికెట్ల వ్యవహారం పూర్తిగా జగన్‌మోహన్‌రెడ్డి చేతిలోనే ఉందని, ఎంపీ టికెట్ కోసం రూ.120 కోట్లు కోట్ చేశారని, దానికి సరేనంటే.. మాట్లాడతానని సమాధానమిచ్చినట్లు ప్రచారం జరిగింది. అంత డబ్బు తాను ఇవ్వలేనని, గత ఎన్నికల్లో పెట్టుకున్న ఖర్చు ఇంకా తిరిగి రాలేదని, రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు ఇవ్వగలనని పోచా సదరు మంత్రికి చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని, పరిస్థితులు అనుకూలిస్తే టికెట్ వచ్చేలా చేస్తానని చెప్పాడని సమాచారం. మంత్రి మాట ఇస్తే తనకే సీటు వస్తుందన్న ఉద్దేశంతో సదరు మంత్రికి పోచా భారీగానే లెక్క ముట్టజెప్పి సంతోషపరిచినట్లు పార్టీ వర్గాలే చెప్పుకుంటున్నాయి. ఆ తర్వాత కొద్ది రోజులకు టికెట్ విషయమై సదరు మంత్రిని పోచా సంప్రదించగా.. నంద్యాల ఎంపీ టికెట్ ధర విషయంలో పార్టీ ఏమాత్రం తగ్గడం లేదని, దానికి సరేనంటే ఎంపీ టికెట్ దక్కుతుందని చెప్పారు. దీంతో పోచా మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది.



మైనార్టీలకేనంటూ..

నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంలో మైనార్టీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. మైనార్టీలు తమ వెంటే ఉన్నారంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేస్తుంటారు. గత ఎన్నికల అనంతరం అధికార పార్టీ పాలనా తీరుతో విసిగిపోయిన మైనార్టీలు వైసీపీని ఈసడించుకోవడం మొదలుపెట్టారు. సంవత్సరం కిందట జరిపిన సర్వేలో ఇదే విషయం వెల్లడి అయింది. జిల్లాకు మూడు ముఖ్యమైన పదవులు ఇచ్చినా కూడా ప్రజల్లో ఎందుకు వ్యతిరేకత వస్తోందంటూ జిల్లా నాయకులను ప్రశ్నించినట్లు సమాచారం. దీనిని పోగొట్టేందుకు నంద్యాల ఎంపీ సీటును మైనార్టీలకు ఇస్తే బాగుంటుందన్న ఆలోచించారు. మొదట ఇటీవల కాంగ్రెస్ నుంచి వైసీపీలోనికి చేరిన మైనార్టీ నాయకుడికి టికెట్ ఇవ్వాలని అనుకున్నా.. ఆ తర్వాత అతను సరైన వ్యక్తి కాదని పక్కన పెట్టారు. ఆ తర్వాత ఓ సినీ నటుడిని కూడా పరిగణలోనికి తీసుకున్నారు. అతనే ఎంపీ అభ్యర్థి అంటూ గట్టిగానే ప్రచారం కూడా జరిగింది. సదరు సినీ నటుడు తనకు గుంటూరు అయితే బాగుంటుందని, నంద్యాల తనకు పూర్తిగా కొత్తవుతుందని వైసీపీ పెద్దలకు చెప్పి తప్పుకున్నట్లు తెలుస్తోంది. వీరు కాకుండా మైనారిటీల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, స్థానిక ఎమ్మెల్సీ పేర్లను కూడా వైసీపీ నాయకులు పరిశీలించారు. అయితే వాళ్లు అంత డబ్బు ఖర్చు పెట్టుకోలేరన్న ఉద్దేశంతో వారిని కూడా పక్కన పెట్టినట్లు సమాచారం. జిల్లాలో బలమైన మైనారిటీ నాయకులు లేకపోవడంతో వైసీపీ మైనార్టీ కార్డును వెనక్కు తీసుకున్నట్లు సమాచారం. మొత్తానికి మైనార్టీలకే నంద్యాల ఎంపీ సీటు అంటూ వైసీపీ చేసిన హడావిడి ప్రచారానికే పరిమితమైంది.

ప్రజల్లో నమ్మకం కోల్పోయారనేనా..?

గత ఎన్నికల్లో వైసీపీ తరఫున పోచా బ్రహ్మానందరెడ్డి మొదటిసారి ఎంపీగా పోటీ చేశారు. వైసీపీ గాలి బలంగా వీచడంతో పాటు, డబ్బు బాగానే ఖర్చు పెట్టుకోవడంతో ఆయన గెలిచారు. ఎంపీగా గెలిచారన్న మాటేగానీ.. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గానికి పెద్దగా చేసిందేమీ లేదు. సొంత వ్యాపారాల మీద ఎక్కువగా దృష్టి సారించి, ప్రజా సమస్యలను గాలికి వదిలేశాడన్న విమర్శలు మూట గట్టుకున్నారు. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గానికి ఓ ఎంపీ ఉన్నాడన్న విషయం కూడా ప్రజలు మరిచిపోయారు. ఇవన్నీ వైసీపీ అధిష్ఠానం దృష్టికి వెళ్లాయి. దీంతో పోచాను పక్కన పెట్టాలని అనుకున్నారు. దీనికి తోడు ఎంపీ అయినప్పటికీ తనకు జిల్లాలో కనీస ప్రాధాన్యం లేదని, సాధారణ కౌన్సిలర్‌కు ఇస్తున్న గౌరవాన్ని కూడా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇవ్వడం లేదని పోచా తన అనుయాయుల దగ్గర వెలిబుచ్చినట్లు సమాచారం. పార్టీకి కోట్ల రూపాయలు ముట్టజెప్పి, ఎన్నికల్లో ఖర్చు పెట్టుకున్నా ఫలితం లేనపుడు పోటీ చేయడం ఎందుకున్న భావనలో కూడా కొద్దిరోజులు ఉన్నట్లు ఆయన వర్గీయులు చెబుతున్న మాట. అటు పార్టీ అధిష్ఠానం పోచాను పరిగణలోనికి తీసుకోకపోవడం, ఇటు ఆయన కూడా సుముఖంగా లేకపోవడంతో వైసీపీ పెద్దలు నంద్యాల ఎంపీ స్థానానికి ఇతరులను పరిశీలించారు. దీంతో నంద్యాల ఎంపీ టికెట్ పోచాకు లేనట్లేనన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

వ్యతిరేకత ఉన్నా..

సామాజిక కోణం, టికెట్ కొనుక్కోగల సామర్థ్యం ఉన్న అభ్యర్థికి నంద్యాల ఎంపీ టికెట్ ఇవ్వాలనే వైసీపీ అధినాయకత్వం ప్రమాణం పెట్టుకోవడంతో ఏ నిర్ణయానికీ రాలేకపోయింది. ఈ క్రమంలో పలువురి పేర్లు వినిపించాయి. మధ్యలో కొద్దిరోజులు టీటీడీ ఈవో స్థాయి వ్యక్తి జిల్లాకు చెందిన వాడే కావడంతో ఆయనకు సీటు ఇస్తున్నారంటూ ప్రచారం జరిగింది. నంద్యాల వైసీపీ ఎంపీ అభ్యర్థి వీరేనంటూ రోజుకో పేరు వినిపించడంతో చివరకు టికెట్ ఎవరికి దక్కుతుందన్న ఆసక్తి జిల్లా ప్రజల్లో ఎక్కువైంది. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు పోచాకే టికెట్ దక్కిందన్న వార్త కూడా వినిపిస్తోంది. తన వ్యాపారాలు, ఇతరత్రా వ్యవహారాలు సజావుగా సాగాలంటే పదవి ముఖ్యమన్న భావనతో పార్టీ చెప్పిన డబ్బు ఇచ్చేందుకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న కారణంగా ఆలోచిద్దామని పార్టీ పెద్దలు యోచించినా.. పోచా అయితే తమ విషయాల్లో కలగజేసుకోడు కాబట్టి ఆయనకు ఇస్తేనే బాగుంటుందన్న అభిప్రాయాన్ని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా చెప్పినట్లు తెలుస్తోంది. ప్రజల బాగోగుల కంటే సీట్ల బేరంలో లాభాల కోసమే ఆలోచిస్తున్నారనే విమర్శలు నంద్యాల జిల్లా ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

మాటల్లోనే అభివృద్ధి

- కేంద్ర పథకాలకు వైసీపీ సర్కారు స్టిక్కర్లు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



సమావేశంలో ప్రసంగిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి

నంద్యాల (కల్చరల్), జనవరి 21: రాష్ట్రంలో ఉన్నది మాటల ప్రభుత్వమే కాని చేతల ప్రభుత్వం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం నంద్యాల సౌజన్య ఫంక్షన్ హాలులో నిర్వహించిన పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి ప్రజలందరికీ వివరిస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్ వేసుకొని ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సోమవారం బలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దాదాపు అన్ని రాష్ట్రాలు సెలవు దినంగా ప్రకటిస్తే వైసీపీ ప్రభుత్వం ఇంతవరకు ప్రకటించలేదన్నారు. నంద్యాల జిల్లాకు ఒక్క పరిశ్రమ కూడా తీసుకు రాలేదని దుయ్యబట్టారు. కొలిమిగుండ్లలో ఉన్న సిమెంటు ఫ్యాక్టరీని అభివృద్ధి చేయలేదని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారతదేశంలో నాలుగు కోట్ల ఇళ్లు మంజూరైతే ఏపీకి 20 లక్షల ఇళ్లు ఇచ్చారని వివరించారు. బనగానపల్లెకు ఇంతవరకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. కొలిమిగుండ్లలో నాపరాతి పరిశ్రమలకు రాయల్టీని 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తామని చెప్పి పట్టించుకోలేదని విమర్శించారు. కుందూ నదిని ఆధునికీకరిస్తామన్నారని, ఇంతవరకు ఆ పని చేయలేదన్నారు. దీని వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఉన్న దద్దనాల ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని తెలిపారు. కోవెలకుంట్ల మండలంలో జోలదరాశి ప్రాజెక్టు పనులు కూడా మొదలు పెట్టలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరుతో ప్రజలో ఆడుకుంటోందని మండిపడ్డారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఓటరు జాబితా సిద్ధం చేయండి

ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి

నంద్యాల (కల్చరల్), జనవరి 21: నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ఈఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ పలు అంశాలపై ఆరా తీశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించిన ఫిర్యాదులు పరిష్కరించారా లేదా అని అడిగారు. ఫేక్ వ్యక్తులు ఇతరుల ఆధార్ నెంబర్‌తో ఓటర్ సవరణపై ఫిర్యాదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరినీ ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సోమవారం బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఓటరు జాబితా ప్రచురణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 25వ తేదీ జాతీయ ఓట్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రెండు పర్యాయాలు జిల్లాకు వచ్చిన జాబితాపై సూచించిన సలహాలను పరిగణలోకి తీసుకొని తుది ఓటర్ల జాబితా రూపకల్పనకు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో అన్ని నియోజకవర్గాల స్పెషల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి

శ్రీరామ పట్టాభిషేకం

కర్నూలు(కల్చరల్) జనవరి 21: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం నగరంలో అయోధ్య రామునికి పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేశారు. పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జమ్మిచెట్టు నుంచి 15 అడుగుల శ్రీరాముని విగ్రహంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు శోభా యాత్ర నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6.30 గంటలకు ధార్మిక ప్రవచనాలను ఏర్పాటు చేశారు. రాత్రి 7.30 గంటలకు శ్రీరామ పట్టాభిషేకాన్ని డాక్టర్ మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి బృందం నిర్వహిస్తుంది. దీని కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏడు ద్వారాలతో కూడిన రామమందిరం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో జి. పుల్లారెడ్డి తనయుడిని ఘనంగా సత్కరిస్తారు.

కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు




సంఘ్ జాతీయ నేతలతో జిల్లాకు అనుబంధం

అయోధ్యలో సోమవారం రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో ఉత్సవాలను ఏర్పాటు చేశారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి పాటుపడిన సంఘ్‌పరివార్ జాతీయ నాయకులతో ఉమ్మడి కర్నూలు జిల్లాకు అనుబంధం ఉంది. అలాంటి నాయకుల్లో ఒకరైన జి.పుల్లారెడ్డి జిల్లాకు చెందినవారే. ఆయనకు జాతీయ నేతలతో ఉన్న అనుబంధం వల్ల విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ రెండు మూడుసార్లు ఆయన కర్నూలుకు వచ్చి జి. పుల్లారెడ్డితో వివిధ అంశాలను చర్చించినట్లు ఆనాటి వీహెచ్‌పీ నాయకుడు ఇ. మల్లికార్జున రెడ్డి గుర్తు చేసుకున్నారు. బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ దక్షిణ భారత రథయాత్రలో భాగంగా కర్నూలు మీదుగానే అనంతపురం వెళ్లారు. ఆయన వెంట ఆనాటి బీజేపీ నేత వెంకయ్య నాయుడు తదితరులు ఉన్నారు. వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తొగాడియా కర్నూలులో నేటి వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలుకు వచ్చారు.



జి. పుల్లారెడ్డి, అశోక్ సింఘాల్‌తో నాటి వీహెచ్‌పీ జిల్లా నాయకుడు మల్లికార్జున రెడ్డి దంపతులు



పాణ్యంలో సీట్లాట

- కాటసాని వర్సెస్ బైరెడ్డి!
- టికెట్ కోసం అధిష్టానంపై సిద్ధార్థరెడ్డి ఒత్తిడి
- స్వతంత్రంగానైనా బరిలో దిగుతానని తేల్చి చెప్పిన కాటసాని
- మహిళా కోటా కింద రేణుక, శ్వేతారెడ్డి ప్రయత్నాలు

సీట్లాట ఆసక్తికరంగా మారింది. ఏ ఇద్దరు కలసినా ఇదే చర్చ జరుగుతోంది.

కర్నూలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గం వైసీపీ టికెట్ కోసం ఆ పార్టీ నాయకులు పోటాపోటీగా ప్రయత్నిస్తున్నారు. దీంతో సీట్లాట ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టాలని ఆరాటపడుతున్న వైసీపీ యువనేత, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి టికెట్ కోసం అధిష్టానంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. నందికొట్కూరు (ఎస్సీ) రిజర్వుడు నియోజకవర్గం టికెట్ మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామికి ఇవ్వాలని సిద్ధార్థరెడ్డి సూచించారు. కానీ కడప జిల్లాకు చెందిన డాక్టర్ సుధీర్‌కు సీఎం జగన్ టికెట్ ఇచ్చారు. దీనిని జీర్ణించుకోలేని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నందికొట్కూరులో తాను సూచించిన వ్యక్తికి టికెట్ ఇవ్వలేదని, కనీసం పాణ్యం నుంచి పోటీ చేసేందుకు తనకైనా అవకాశం ఇవ్వాలని ఒత్తిడి పెంచినట్లు సమాచారం. అయితే తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తానని అధిష్టానానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తేల్చి చెప్పినట్లు సమాచారం. అదే క్రమంలో అవకాశం ఉంటే తమకు చాన్స్ ఇవ్వాలని కర్నూలు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఎస్. శ్రీధర్‌రెడ్డి దంపతులు, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి తెర వెనుక ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మరో నాలుగైదు రోజుల్లో వైసీపీ అభ్యర్థుల ఐదో జాబితా రానున్న తరుణంలో పాణ్యం వైసీపీ సీట్లాట ఆసక్తికరంగా మారింది. ఏ ఇద్దరు కలసినా ఇదే చర్చ జరుగుతోంది.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తీవ్ర ప్రయత్నం


బైరెడ్డి సిద్ధార్థరెడ్డి 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. ప్రత్యేక్ష రాజకీయాల్లో దూసుకుపోతూ ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఆర్థర్ గెలుపు కోసం కృషి చేశారు. ఆర్థర్ ఎమ్మెల్యేగా గెలిచాక వారిద్దరి మధ్య రాజకీయ వర్గ విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయి. ప్రస్తుతం ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆర్థర్‌కు టికెట్ ఇవ్వకూడదని, తాను సూచించిన మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామికి ఇవ్వాలని తాడేపల్లి ప్యాలెస్ పెద్దలపై ఒత్తిడి తెచ్చారు. అయితే.. సిద్ధార్థకు సీఎం జగన్ షాక్ ఇచ్చి.. కడప జిల్లాకు చెందిన నాన్ లోకల్ డాక్టర్ సుధీర్‌కు టికెట్ ఇచ్చారు. నాలుగో జాబితాలో అధికారికంగా ప్రకటించారు. దీనిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తనకు పాణ్యం టికెట్ ఇస్తే పార్టీ నుంచి ఎలాంటి ఫండ్ ఆశించకుండా ఎన్నికల ఖర్చు మొత్తం తానే భరిస్తానని సజ్జల, ధనుంజయరెడ్డి వంటి వారి ముందు ప్రతిపాదన పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే.. పాణ్యం వైసీపీ అభ్యర్థి సిద్ధార్థరెడ్డే అంటూ ఆయన వర్గీయులు, అనుచరులు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసానికి టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు లేవని సర్వేలు చెబుతున్నాయి. అందువల్ల కూడా తనకు చాన్స్ ఇవ్వాలని బైరెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కు ఇప్పటికే రెండుమూడు పర్యాయాలు వెళ్లి గట్టిగా ప్రయత్నించినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై ఆంధ్రజ్యోతి ఆరా తీస్తే.. నందికొట్కూరులో ఇంటి స్థలాల విషయం చర్చించానిని పేర్కొనడం కొసమెరుపు.



ధీమా ఉన్నా.. లోలోన భయమే !

పాణ్యం వైసీపీ టికెట్ తనకు కాక మరెవరికి ఇస్తారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధీమాగా ఉన్నారు. అయితే నాయకుల ఊహలకు అందని విధంగా సీఎం జగన్ ఎమ్మిగనూరులో మాచాని వెంకటేశ్, నందికొట్కూరులో నాన్ లోకల్ అయిన డాక్టర్ సుధీర్, కోడుమూరులో నాన్ లోకల్ అయిన డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌లకు టికెట్ ఇచ్చారు. పాణ్యం టికెట్ కాటసాని ఇస్తారా..? ఐప్యాక్ సర్వే పేరుతో కొత్తవారిని బరిలో దింపుతారా..? దీనిపై కాటసాని వర్గీయులు లోలోన ఆందోళన చెందుతున్నారు. కాగా.. ఐప్యాక్ సర్వేలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఈ దఫా నంద్యాల ఎంపీగా వెళ్లాలని వైసీపీ పెద్దలు కాటసాని రాంభూపాల్‌రెడ్డితో చర్చించినట్లు సమాచారం. అదే క్రమంలో పాణ్యం నియోజకవర్గంలో కూడా సర్వే ఫలితాలు ప్రతికూలంగా ఉన్నాయని కాటసానికి సూచించినట్లు తెలుస్తోంది. అయితే.. 1985 నుంచి 2019 వరకు పాణ్యం నియోజకవర్గం నుంచి తొమ్మిది పర్యాయాలు పోటీ చేస్తే ఆరు పర్యాయాలు కాటసాని గెలిచారు. 2014లో స్వతంత్రంగా పోటీ చేసి 60,598 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. అందువల్ల తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర్యంగా అయినా పోటీ చేస్తాగాని పాణ్యం వదిలే ప్రసక్తే లేదని ఆయన వైసీపీ పెద్దలకు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో రాబోయే ఐదో జాబితాలో కాటసాని పేరు ఉంటుందా..? మరో వ్యక్తి తెరపైకి వస్తారా..? అని కాటసాని వర్గీయులు లోలోన ఆందోళనపడుతున్నప్పటికీ టికెట్‌పై మాత్రం ధీమాగానే ఉన్నారు.

పోటీలో మేము సైతం..



వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డితో గాజుల శ్వేతారెడ్డి

పాణ్యం టికెట్ కోసం ఓ వైపు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే కాటసానిల మధ్య కోల్డ్‌వార్ జరుగుతుండగా.. ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని కర్నూలు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఆమె భర్త ఎస్.శ్రీధర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. టికెట్ ఇస్తే ఖర్చు మొత్తం తామే భరిస్తామని కూడా జిల్లాలో వైసీపీ రాజకీయ వ్యవహారాలు చూస్తున్న కడప జిల్లాకు చెందిన ఓ ముఖ్య నాయకుడి ద్వారా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే.. వైసీపీలో ఎంపీ విజయసాయిరెడ్డికి సమీప బంధువు అయిన కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల వైసీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమె భర్త జి. కవినాథ్‌రెడ్డి పారిశ్రామికవేత కావడం, వైసీపీ పెద్దలతో సన్నిహిత సంబధాలు ఉండడంతో శ్వేతారెడ్డి గట్టిగానే ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మహిళా కోటా కింద అవకాశం ఇవ్వాల్సి వస్తే తనను పరిగణలోకి తీసుకోవాలని డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అధి నాయకత్వం వద్ద ప్రయత్నిస్తున్నారు. ఇటీవల జరిగిన సామాజిక సాధికార యాత్ర సందర్భంగా వేదికకు ఎదురుగా ఓ కార్యకర్త చేతిలోని గాజుల శ్వేతారెడ్డి ఫ్లకార్డును కాటసాని వర్గీయులు తీసేయడం చర్చనీయాశంగా మారింది. ఆమె టికెట్ కోసం ప్రయత్నిస్తున్నందు వల్లే ఫ్లకార్డు తొలించారనే ఆరోపణలు లేకపోలేదు.



సిద్ధారెడ్డి రేణుక

జరిమానాలు రద్దు చేయాలి

- రోడ్లు విస్తరించాలి
- పీపీఎస్ఎస్ అధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య

కర్నూలు(న్యూసిటీ), జనవరి 21: నగరంలో సెన్సార్ కెమెరాలతో జరిమానా వేసే పద్ధతిని తక్షణమే రద్దు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఆదివారం బీఏఎస్ కళ్యాణమండపంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులపై ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్‌ను రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల నాయకుడు యాకోబు అధ్యక్షతన జరిగిన చర్చా వేదికలో పలువురు వక్తలు సెన్సార్ కెమెరాల ఏర్పాటుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో సెన్సార్ కెమెరాలను ఏర్పాటు చేసి ద్విచక్ర, తిచక్ర, నాలుగు చక్రాల వాహనదారులకు జరిమానాలు విధిస్తూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు దండుకుంటోందని అన్నారు. నగరంలో రోడ్లు విస్తరించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి, సభ్యులు నౌషద్, కళాకారుల సంఘం నాయకులు రమణారెడ్డి, నాయకులు ఎం.నాగరాజు, సివి. వర్మ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపిస్తేనే రాష్ట్రం అభివృద్ధి

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 21: వైసీపీ ఇంటికి వెళితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని నంద్యాల టీడీపీ అధ్యకుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఆదాయం పెరగలేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కూడా రాలేదఇ అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలపై బాదుడే బాదుడన్నారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫాలను ఏమయ్యాయని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో నాణ్యమైన మద్యం సరఫరా చేశామని, వైసీపీ అధికారంలో నాసిరకం కల్తీ మందులు విక్ర యిస్తూ పేదల జీవితాలను నాశనం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పైసా కూడా కరెంటు చార్జీలు పెంచలేదన్నారు. వైసీపీ పాలనలో నష్టపోయింది బడుగు, బలహీన వర్గాల ప్రజలేనన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక భూరక్షణ చట్టం బదిలీ చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టును గత టీడీపీ ప్రభుత్వం 75 శాతం పూర్తి చేస్తే.. జగన్ రెడ్డి ఈ ప్రాజెక్టును నాశనం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు బజారు, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవులను ఓబీసీలుగా గుర్తించాలి

లింగాయత్ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు దండిన శివానంద రావు

ఆదోని టౌన్, జనవరి 21 : రాష్ట్రంలో 9.75 లక్షల జనాభా ఉన్న వీరశైవులను ఓబీసీలుగా గుర్తించాలని అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు దండిన శివానంద రావు, వీరశైవ సమాజ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు గూళ్యం శివరుద్రప్ప అన్నారు. ఆదివారం వీరు విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం బీసీ-డీగా ఉన్న తమను ఓబీసీలుగా గుర్తించాలని, చాలా కాలంగా కోరుతున్నామని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఈ నెల 25న ఆదోనిలో పురస్కారాలను అందజేసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి కేఎం మల్లికార్జున స్వామి, రాష్ట్ర కార్యదర్శి దేశాయ్ చంద్రన్న, ఈసీ మెంబర్ శరణ బసప్ప, రమేష్, విశ్వనాథ్, మహేష్ కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపిస్తేనే అభివృద్ధి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), జనవరి 21: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం జగన్‌రెడ్డి అనే నియంతకు అధికారం ఇచ్చి.. అయన ఆనాలోచిత, పిచ్చి నిర్ణయాలతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. టీడీపీకి వచ్చే ఎన్నికల్లో అధికారం ఇస్తే సూపర్ సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాలను ఆదుకుంటుందన్నారు. గతంలో రూ. 200 ఉన్న పింఛన్ తెలుగుదేశం ప్రభుత్వం రూ 2వేలకు పెంచి పేదలకు అందించిందన్నారు. ఒకప్పుడు నాణ్యమైన మద్యం క్వార్టర్ రూ. 70 ఉంటే ఇప్పుడు రూ. 270 చేశారని, మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానని చెప్పిన జగన్ తెచ్చిన కల్తీమద్యం తాగి 35 లక్షల మంది అనారోగ్యం పాలయ్యారని అన్నారు. 30వేల మంది మరణించారని తెలిపారు. పింఛన్ 3వేలు పెంచుతానని చెప్పి కేవలం 250 పెంచి మోసం చేశారని అన్నారు. రాష్ట్రం కోసం, ప్రజల కోసం తపించే తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు.

రూ.50పై బాల రాముడు



రూ.50ల నోటు పై చిత్రీకరించిన బాలరాముడి చిత్రం

ఆదోని, జనవరి 21 : ఆదోని మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన మల్లికార్జున రూ.50 నోటుపై బాలరాముడి చిత్రం వేసి శభాష్ అనిపించుకున్నాడు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆయన ఈ చిత్రాన్ని వేశారు. మల్లికార్జున ఆలూరు మండలం, కమ్మరచెడు హైస్కూల్‌లో కాంట్రాక్టు పద్ధతిన డ్రాయింగ్ మాస్టర్‌గా పని చేస్తున్నారు.

వీడిన హత్య కేసుల మిస్టరీ



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

పత్తికొండ, జనవరి 21 : భార్య కాపురానికి రావడం లేదన్న మానసిక వేదనతో సైకోగా మారిన ఓ వ్యక్తి హత్యలకు తెగబడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలను పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన వెంకటన్న కుమారుడు మాసెపోగు మాదెన్న కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివి మానేశాడు. ఆ తరువాత ఇతడికి తుగ్గలి మండలం మారెళ్లకు చెందిన జయమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. సంతానం కలిగిన తర్వాత భర్త మానసిక పరిస్థితిలో మార్పు రావడంతో జయమ్మ పిల్లలను తీసుకుని పుట్టింటికి చేరుకుంది. అయితే కాపురానికి రావాలంటూ మాదెన్న భార్య వద్దకు వచ్చేవాడు. మానసిక స్థితి సరిగాలేని అతనితో ఆమె కలిసి బతకడానికి నిరాకరించేది. దీంతో మాదెన్న చెరుకులపాడు నుంచి అప్పుడప్పుడు వచ్చి భార్యా పిల్లలను కలిసి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో తనలాగే మానసిక స్థితిసరిగా లేక కుటుంబం నుంచి దూరమైన వారిని హత్య చేస్తే తన భార్య ఇంటికి రానిస్తుందని ఆలోచన చేశాడు. అందుకోసం భార్య జీవిస్తున్న మారెళ్ల గ్రామ సమీపంలో ఆర్ఎస్ పెండేకల్ స్టేషన్‌ను అనువైన ప్రాంతంగా ఎంచుకున్నాడు. గత ఏడాది మార్చిలో స్టేషన్ ఆవరణలో నిద్రిస్తున్న మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి తలపై రాయితో బాది హత్య చేశాడు. అయితే హత్యకు సంబంధించిన ఆనవాళ్లు తెలియకపోవడంతో పోలీసులు కేసు విచారణను నిలిపివేశారు. ఆ తరువాత ఈ నెల 6న

నిందితుడు సైకో అని గుర్తించిన పోలీసులు

తుగ్గలి మండల పరిధిలోని ఆర్ఎస్ పెండేకల్ రైల్వేస్టేషన్ సమీపంలో మతిస్థిమితం లేని పూజారి రాము (57) హత్యకు గురయ్యాడు. రైల్వేస్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న మతిస్థిమితం లేని పూజారి రామును రాయితో తలపై బాది హత్య చేశాడు. ఈ హత్య స్థానికంగా సంచలనం కలిగించింది. రాము ఎమ్మెల్సీ సునీతకు స్వయాన అన్న కావడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ రెండు హత్యలు ఒకే తరహాలో ఉండడంతో హంతకుడు సైకో అయి ఉంటాడన్న కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. హత్య జరిగిన సమయంలో ఆర్ఎస్ పెండేకల్ గ్రామంలోని ఓ సీసీ పుటేజీ, మారెళ్ల గ్రామంలోని సీసీ పుటేజీలలో ఒకే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆ వ్యక్తి వివరాల సేకరించారు. చెరుకులపాడుకు చెందిన మాదెన్నగా గుర్తించి అతని కోసం గాలింపు చేపట్టారు. దీంతో పోలీసులు తనను అరెస్టు చేయడం ఖాయమని తెలుసుకున్న మాదన్న ఎద్దులదొడ్డి వీఆర్‌వో కాశీంరంగస్వామి వద్ద లొంగిపోయాడు. తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో వెళ్లి మాదన్నను అరెస్టు చేశారు. నిందితునిపై రెండు హత్యలకు సంబంధించిన కేసులు నమోదు చేశామని రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. హత్య కేసు మిస్టరీని ఛేదించినందుకు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునతోపాటు సిబ్బందికి ఎస్పీ రివార్డు ప్రకటించారు.

రూ.కోటి నగదుతో పట్టుబడ్డ వ్యక్తి

- రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా బయటపడ్డ డబ్బు
- అరెస్టు చేసిన రైల్వే పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

ఆదోని, జనవరి 21: ఆదోనిలో ఆదివారం అర్ధరాత్రి రైలులో రూ.కోటి అక్రమ నగదుతో ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. రైల్వే పోలీసులు ప్లాట్‌ఫారం నెం-1లో తనిఖీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి తడబడుతూ డబ్బు ఉన్న బ్యాగుతో అటూ, ఇటూ తిరుగుతుండటం గమనించిన పోలీసులకు అనుమానం వచ్చి అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. అందులో భారీగా నగదు కనిపించింది. ఆదోని పట్టణం హవన్నపేటకు చెందిన కోల్కర్ మహమ్మద్ హైదరాబాద్ బేగంపేట నుంచి ఆదోనికి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12794)లో అక్రమంగా డబ్బు తీసుకొని వచ్చాడు. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంటకు ఆదోని రైల్వే స్టేషన్‌లో నిందితుడు దిగాడు. ఆ డబ్బుకు సంబంధించిన ఎలాంటి రసీదులు, వివరాలు లేకపోవడంతో ఆదోని రైల్వే ఆర్‌పీఎఫ్ ఎస్సైలు గోపాల్, రామస్వామి, లక్ష్మణ్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వర స్వామి, పరశురాముడు, శివరామయ్య, శేక్షావలి నగదు స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిని అరెస్టు చేశారు. నగదుకు ఆధారాలు లేకపోవడంతో తదుపరి చర్యలు నిమిత్తం ఆదాయపు పన్ను శాఖకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అనారోగ్యం ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలి

నంద్యాల (నూనెపల్లె), జనవరి 21: సార్వత్రిక ఎన్నికల విధుల్లో 55 సంవత్సరాలు పైబడిన, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.వీ.శివయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, పుల్లయ్య, రంగనాయకులు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి'

నంద్యాల (కల్చరల్), జనవరి 21: పద్మశాలీలు రాజకీయంగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని రాయలసీమ ఇంజనీరింగ్ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు మద్దాల మోహన్‌కుమార్ అన్నారు. నంద్యాల భద్రావతీభావనా రుషి ఆలయంలో ఆదివారం పద్మశాలి ఇంజనీరింగ్ విభాగ సంఘం సమావేశం నిర్వహించారు. రాయలసీమ ఇంజనీరింగ్ విభాగ అధ్యక్ష కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత పద్మశాలీల సంఘం అధ్యక్షుడు కంగట్ల స్వామి, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు పాండురంగయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుమాధవ్, కర్నూలు జిల్లా పద్మశాలీయ సంఘం అధ్యక్షులు భీమనపల్లె వెంకటసుబ్బయ్య, పద్మశాలి సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

లారీ అపహరణ

గడివేముల, జనవరి 21: పార్కింగ్‌లో ఉంచిన లారీని కొందరు దుండగులు అపహరించుకుపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ బీటీ వెంకట సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు బూజనూరు గ్రామానికి చెందిన చిన్న రంగయ్య డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. తన సొంత లారీని ఈ నెల 8వ తేదీన జిందాల్ పరిశ్రమ వద్ద ఉన్న పార్కింగ్ ప్రదేశంలో ఉంచి వెళ్లాడు. మరుసటి ఉదయం వెళ్లి చూడగా పార్కింగ్‌లో ఉంచిన లారీ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా లారీ ఆచూకి లభించకపోవడంతో బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీవీ సుబ్బయ్యకు ప్రతిష్టాత్మక పురస్కారం



డీవీ సుబ్బయ్యను అభినందిస్తున్న చిన్నపరెడ్డి

నంద్యాల (కల్చరల్), జనవరి 21: మిడ్‌టౌన్ రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు రోటరీ విద్యాసంస్థల అధినేత డీవీ సుబ్బయ్యకు రోటరీ ఇంటర్నేషనల్ లో ప్రతిష్టాత్మక పాల్ హారీష్ ఫెలో పురస్కారం లభించింది. ఈ సందర్భంగా రోటరీ డీఆర్ఎఫ్‌సీ చైర్మన్ చిన్నపరెడ్డి ఆయనను అభినందించారు. రోటరీ క్లబ్ ద్వారా వివిధ పదవులు అలంకరించి విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఈ గుర్తింపు లభించిందని చిన్నపురెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోటరీ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి ప్రసాద్, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, తదితరులు పాల్గొని డీవీ సుబ్బయ్యను అభినందించారు.

రిపబ్లిక్ డే న్యూఢిల్లీ ఉత్సవాలకు గిరిజన బాలిక

పాణ్యం, జనవరి 21 : రిపబ్లిక్ డే ఢిల్లీ ఉత్సవాలకు మండలంలోని బలపనూరు పరిధిలోని ఏపీ గిరిజన గురుకుల పాఠశాల బాలిక ఆర్. రాధికాబాయి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరీసలోమి ఆదివారం తెలిపారు. న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ ఉత్సవాలలో 9 వతరగతి (ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ బెనిఫిషరీస్ ఫర్ విటెన్ సింగ్) బాలికను ప్రత్యేక ఆహ్వానితురాలిగా ఏపీ గిరిజన సంక్షేమ శాఖ ఎంపిక చేసినట్లు తెలిపారు.

సీఐగా ప్రసాదరావు బాధ్యతలు

శ్రీశైలం, జనవరి 21: శ్రీశైలం నూతన సీఐగా జి.ప్రసాదరావు ఆదివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. గతంలో చిత్తూరు సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన శ్రీశైలంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వన్‌టౌన్ ఎస్సై లక్ష్మణరావు, టూటౌన్ ఎస్సై గంగయ్య యాదవ్ సిబ్బందితో కలిసి సీఐ ప్రసాదరావుకు స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సర్కిల్ పరిధిలోని ప్రధాన సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటట్లాడుతూ క్షేత్ర పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీఐ తెలిపారు. స్థానికులు, భక్తులు ఎవైన సమస్యలు ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించాలని సీఐ ప్రసాదరావు కోరారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

మహానంది,జనవరి 21: పురాతన ఆలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపినట్లు మాన్యం భూమి కౌలుదారుడు కె.రఘురామిరెడ్డి ఆదివారం తెలిపారు. మహానంది మండలం బుక్కాపురం పొలిమేరల్లోని అల్లీనగరం గ్రామం సమీపంలో మహానంది దేవస్థానానికి చెందిన మాన్యం భూమి ఉంది. ఇదే పొలంలో పురతాన శివాలయంలో రాతి శివలింగంతో పాటు నంది విగ్రహం ఉంది. పురాతన ఆలయం కావడంతో నిధులు ఉండవచ్చనే ఉద్దేశంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం అర్థ రాత్రి పూజలు నిర్వహించి తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. గతంలో కూడ ఇక్కడ తవ్వకాలు జరిపిన విషయం తెలిసిందే.

శ్రీశైలం చేరుకున్న పురందేశ్వరి

శ్రీశైలం, జనవరి 21: రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదివారం రాత్రి శ్రీశైలం చేరుకున్నారు. సోమవారం ఉదయం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకోనున్నారు. అనంతరం ఆయోధ్యలో రామమందిరంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని శ్రీశైలం దేవస్థానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లలో ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులతో కలిసి వీక్షించనున్నారు. బీజెపి జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి తదితర నాయకులు ఆమెకు స్వాగతం పలికారు.

టీడీపీతోనే యువత భవిష్యత్తు

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్
- 8వ వార్డు నుంచి భారీ సంఖ్యలో టీడీపీలో చేరిక


ఎన్ఎండీ ఫరూక్ సమక్షంలో టీడీపీలో చేరిన యువత

నంద్యాల (నూనెపల్లె), జనవరి 21: రాష్ట్రంలోని యువతకు తెలుగుదేశం పార్టీతోనే భవిష్యత్తు ఉంటుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 8వ వార్డు ఇన్‌చార్జి ఉప్పరి సురేష్, ఉప్పరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ ఎత్తున యువకులు ఎన్ఎండీ ఫరూక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌ల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. యువకులకు కండువా వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ టీడీపీతో యువత భవిష్యత్తు ముడిపడి ఉందని, ఐటీ సెక్టార్‌తో పాటు వేల కంపెనీలు రాష్ట్రానికి తెచ్చి లక్షల ఉద్యోగాలు రూపకల్పన చేసి యువకుల జీవితాల్లో చంద్రబాబు నాయుడు వెలుగులు నింపారని గుర్తు చేశారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఉన్నత చదువులు చదివిన యువత జీవితాలను సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ఇస్తానని మోసం చేశారని, ప్రైవేటు, ప్రభుత్వ సెక్టార్లలో ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వకుండా యువత జీవితాలను అంధకారం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రంలో సంక్షేమం, సంపూర్ణ అభివృద్ధితో రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకున్నామని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త పన్ను వేసిన చెత్త సీఎం జగన్

- వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి


మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు జనవరి 21: చెత్తపై పన్నువేసిన చెత్త సీఎం జగన్మోహన్‌రెడ్డి అని నంద్యాల పార్లమెంటరీ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ఆదివారం అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాండ్ర శివానందరెడ్డి మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నిత్యం పన్నుల భారం మోపుతూ ప్రజల నడ్డి విరిచారన్నారు. చివరకు చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు అనేక రకాల సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి జరగడం ఖాయమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మెనిఫెస్టోకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని, రాబోయే ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటుకు తప్పక కృషి చేస్తారని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ముర్తుజావలి, జమీల్, ఇద్రుష్, జనార్ధన్‌రెడ్డి, అల్లూరు గ్రామ సర్పంచ్ నాగలక్ష్మయ్య పాల్గొన్నారు.

బీసీ సదస్సులను విజయవంతం చేయండి : బుడ్డా


మాట్లాడుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జనవరి 21: నియోజకవర్గ పరిధిలో బీసీలను చైతన్యం చేసేలా నిర్వహించనున్న జయహో బీసీ సదస్సులను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయా మండలాల బీసీ నాయకులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆత్మకూరు పట్టణంతోపాటు అన్ని మండలాల్లో జయహో బీసీ సదస్సులు నిర్వహించాలన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన నష్టంతోపాటు గత టీడీపీ హయాంలో జరిగిన లబ్ధిని ఈ సదస్సుల్లో వివరించాలని సూచించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై కూడా బీసీలతో చర్చించి వారి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 30న వెలుగోడు, 31న ఆత్మకూరు, ఫిబ్రవరి 1న బండిఆత్మకూరు, 2న మహానంది మండలాల్లో, 3న ఆత్మకూరు పట్టణం, 4న శ్రీశైలం సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆత్మకూరు పట్టణంతో పాటు అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, ఉల్లి మధు, నాయకులు సీ.కలిముల్లా, ఆర్బీసీ రామకృష్ణ, అబ్దుల్లాపురం బాష, మల్లికార్జునరెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులు, రవీంద్రబాబు, శివకుమార్, శ్రీను, సుబ్బరాజు ఉన్నారు.

కార్మిక, కర్షక మైత్రి నిర్మాత లెనిన్

- నంద్యాలలో లెనిన్ శత వర్ధంతి నిర్వహించిన వామపక్షాలు



సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, జనవరి 21: కార్మిక, కర్షక మైత్రి నిర్మాతగా లెనిన్ పోరాటం భావితరాలకు ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. అన్నారు. ఆదివారం నంద్యాలలో వీ.ఐ.లెనిన్ శత వర్ధంతిని వామపక్ష పార్టీల నాయకులు, అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఎం కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పుల్లా నరసింహుడు అధ్యక్షతన జరిగిన శత వర్ధంతి కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏ.నాగరాజు తదితరులు హాజరై లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గ విముక్తి పోరాట సిద్ధాంతకర్తల్లో లెనిన్ మార్క్స్‌కు సమానమైన వ్యక్తి అని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడానికి రాజకీయ, సైద్ధాంతిక నిర్మాణ పరమైన చర్యలతో ముందుకు సాగాల్సి ఉందని పేర్కొన్నారు.

సీపీఐ కార్యాలయంలో : సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతిని నిర్వహించారు. వర్గచైతన్యంపై చరిత్ర అధ్యయనం చేసిన రచయిత లెనిన్ అని అన్నారు. లెనిన్ ఆశలను నేటి తరం కమ్యూనిస్టులు, యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ లైబ్రరీలో : వీ.ఐ.లెనిన్ శతవర్ధంతిని లైబ్రరీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది బి.శంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సమసమాజ నిర్మాణం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రపంచ మానవాళి వేగుచుక్క లెనిన్ అని కొనియాడారు. కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని తూచా తప్పకుండా రష్యాదేశ పరిస్థితులకు అన్వయించి కార్మిక, కర్షకులను ఏకం చేస్తూ అక్టోబరు 25, 1917లో విప్లవం ద్వారా కార్మిక రాజ్యాన్ని స్థాపించిన మహోన్నతుడు లెనిన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ప్రజా కళాకారుడు చిన్నబాల హుసేని, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, ముర్తుజా, జీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు గ్రామాన్ని చుట్టుముట్టిన ఎస్సార్బీసీ నీరు


సచివాలయం వద్ద చేరిన ఎస్సార్బీసీ నీరు

పాణ్యం, జనవరి 21 : అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుబ్బరాయుని కొత్తూరు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ సమీపంలోని ఎస్ఆర్బీసీ బ్లాక్ 1 సబ్‌కెనాల్ నీరు గ్రామం చుట్టూ చేరి ప్రజల జీవనానికి ఆటంకంగా మారింది. 15 రోజులుగా నీరు ఇళ్ల వద్ద, కార్యాలయాల వద్ద, దేవస్థానం వద్ద చేరి అసౌకర్యంగా మారినా ఎస్సార్బీసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుపూరు రహదారి వైపు గల ఎస్సార్బీసీ కాల్వలో చెత్త చేరి నీరు పైకి ఎక్కి ప్రవహిస్తూ నీరు గ్రామంలోకి చేరిందని స్థానికులు చెబుతున్నారు. దేవస్థానం నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారిపై నీరు చేరి రాకపోకలకు అంతరాయంగా మారింది. దేవస్థానం నిత్యం చెత్తను వేసే డంపుగుంత నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. పంటలకు అందాల్సిన సాగునీరు ఇలా వృథాగా గ్రామంలోకి చేరుతుండడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్బీసీ బ్లాక్ 1కింద 2273. 37 ఎకరాలు సాగులో ఉంది. ఈ పంటలకు చేరాల్సిన నీరు ఇలా వృథాగా పారడంతో పంటలు ఎండే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు గానీ, జలవనరుల శాఖ అధికారులు గానీ, ప్రజాప్రతినిధులుగానీ స్పందించకపోవడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్సార్బీసీ అధికారులను సంప్రదించగా అందుబాటులో లేరు.

పోలీసుల నిర్బంధంలో అంగన్‌వాడీలు


పాణ్యం పోలీసుస్టేషన్‌లో యూనియన్ నాయకులు

పాణ్యం, జనవరి 21 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకులను ఆదివారం పాణ్యం పోలీసులు నిర్బంధించారు. సమ్మెలో భాగంగా ఆదివారం విజయవాడలో చేపట్టిన ధర్నాకు తరలివెళుతున్నారనే కారణంగా ముందస్తు చర్యగా పోలీసులు యూనియన్ నాయకులు వెంకటమ్మ, భారతిలను ఉదయం నుంచి రాత్రి వరకు పోలీసు స్టేషన్ నిర్బంధించినట్లు తెలిపారు. అరెస్టులతో సమ్మెను ఆపలేరని స్పష్టం చేశారు. ఇప్పటికే సీడీపీఓలు కేంద్రాలను తెరవాలని, లేని పక్షంలో ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అంగన్‌వాడీ వర్కర్లపై ఒత్తిడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సీఐటీయూ నాయకులు భాస్కర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్ తెలిపారు. మహిళా నాయకురాళ్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

41వ రోజుకు చేరిన నిరవధిక దీక్షలు


ఆత్మకూరులో 41వ రోజు నిరవధిక దీక్షలో అంగన్‌వాడీలు

ఆత్మకూరు, జనవరి 21: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక దీక్షలు ఆదివారానికి 41వ రోజుకు చేరాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో యూనియన్ నాయకులు మంజులు, రమణమ్మ, లక్ష్మీదేవీ, సీఐటీయు నాయకులు రజాక్, రామ్‌నాయక్, రణధీర్ పాల్గొని ప్రసంగించారు.

సమస్యలు పరిష్కరించాలి : రౌండ్ టేబుల్ సమావేశం

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, జనసేనపార్టీ నాయకులు శ్రీరాములు, బీఎస్పీ నాయకులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మద్దతు ప్రకటించారు.

శిల్పా.. నీచ రాజకీయాలు మానుకో

- శిల్పా వెంచర్‌లో బాలిక మృతిపై అనుమానాలు
- వ్యాపారాల కోసం అనుచరుల నీచ పనులకు వత్తాసు
- ఆడ పిల్లల జీవితాలతో ఆడుకోవడం ఆపండి
- మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అఖిల ప్రియ

నంద్యాల (నూనెపల్లె), జనవరి 21: నంద్యాల, శ్రీశైలం నియోజకవర్గాలలో శిల్పా నీచ రాజకీయాలు ఎక్కువయ్యాయని, త్వరలోనే వారి పాపం పండే రోజు వస్తుందని టీడీపీ నాయకురాలు, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ అన్నారు. ఆదివారం నంద్యాలలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అరాచక పాలన, వారి దారుణాలు రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయని అన్నారు. ఇటీవలే పాండురంగాపురం సమీపంలోని శిల్పా వెంచర్‌లో ఓ మైనర్ బాలిక మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. పేదల పక్షాన న్యాయంగా ఉండకుండా వారి వ్యాపారాల కోసం, అనుచరులు చేసే నీచ పనులకు వత్తాసు పలుకుతూ ఆడ పిల్లల జీవితాలతో ఆడుకోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. నంద్యాల ఎమ్మెల్యే అనుచరుడిగా అనధికార సెక్యూరిటీగా వ్యవహరిస్తున్న చంద్రాయుడు అక్రమ మద్యం అమ్మకాలలో పోలీసులకు అడ్డంగా దొరికిపోవడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని శిల్పా కుటుంబం టీడీపీలోకి చేరేందుకు ప్రయత్నాలు చేయడానికి కొద్దిగైనా సిగ్గు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, మాజీ కౌన్సిలర్ మన్నె కృపాకర్, మోహన్‌రెడ్డి, ఒంటివెలగల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపుదాం


జడ్వారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కొత్తపల్లి, జనవరి 21: మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన సీఎం జగన్‌ను ఇంటికి పంపుదామని టీడీపీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని జడ్వారిపల్లి, గోకవరం గ్రామాల్లో జయసూర్యతో పాటు మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, మాజీ కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, స్వామిరెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, పెద్దస్వామి, రవి, చిన్న, సవారన్న, చిన్నస్వాములు, వెంకటేశ్వర్లు, లింగస్వామి, కుమార్, కొండా హుశేనయ్య, నాగేంద్ర, మహేంద్ర, చంద్రారెడ్డి, గోపాల్ రెడ్డి, నాగశేషన్న, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందన తాత్కాలిక రద్దు

నంద్యాల క్రైం, జనవరి 21 : నంద్యాలలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్జీదారులు సుదూర ప్రాంతం నుంచి వ్యయ ప్రయాసలతో ఎస్పీ కార్యాలయానికి స్పందన కార్యక్రమానికి రావద్దని ఎస్పీ సూచించారు. వచ్చే సోమవారం యధావిధిగా స్పందన కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

సీసీఎస్ సీఐగా మంజునాథ్‌రెడ్డి

నంద్యాల క్రైం, జనవరి 21 : నంద్యాల సీసీఎస్ సీఐగా మంజునాథ్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. సాధారణ బదిలీలో బాగంగా కడప జిల్లా జమ్ములమడుగు రూరల్ సీఐగా పని చేస్తూ నంద్యాల సీసీఎస్ సీఐగా మంజునాథ్‌రెడ్డి బదిలీపై వచ్చారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల టౌన్, జనవరి 21: ఏపీలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరిని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న కోరారు. ఆదివారం నంద్యాలకు వచ్చిన పురంధరేశ్వరికి ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పులికొండన్న మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ అంశంపై 60 ఏళ్లుగా పోరాటం, రాజకీయ పార్టీల తీర్మానాలు త్రిశంకు స్వర్గంలో నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాముడిని శోభ యాత్రకు హాజరుకండి


మాజీ ఎమ్మెల్యే బుడ్డాకు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జనవరి 21: పట్టణంలో ఈనెల 22వ తేదీసోమవారం నిర్వహించే శోభయాత్రకు హాజరుకావాలని శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రతినిధులు ఆదివారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని ఆహ్వానించారు. అయ్యప్పస్వామి ఆలయం నుంచి కేజీరోడ్డు, గౌడ్‌సెంటర్, పాతబస్టాండ్, తోటగేరి, పెద్దబజారు, అమ్మవారిశాల మీదుగా జరిగే శోభయాత్రలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రతినిధులు గరుడాద్రి సత్యనారాయణశర్మ, గరుడాద్రి సుదర్శన్, శివరామకృష్ణ, బాలయ్య, శేగుకిరణ్, పవన్‌కుమార్ ఉన్నారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రి


ఆలయ ప్రాంగణంలో మంత్రి దామోదర రాజనరసింహ

శ్రీశైలం, జనవరి 21: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర్ రాజనరసింహ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజ గోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో మంత్రికి వేదపండితులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- 41వ రోజు సమ్మె చేసిన అంగన్‌వాడీలు
- విజయవాడకు వెళ్లకుండా నిర్బంధించిన పోలీసులు


డోన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు


బేతంచెర్లలో అంగన్‌వాడీలను నిర్బంధించిన పోలీసులు


చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీలు

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అంగన్‌వాడీలు అన్నారు. వారు చేపట్టిన సమ్మె ఆదివారం 41వ రోజుకు చేరుకుంది. సోమవారం జరిగే 'చలో విజయవాడ' కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అంగన్‌వాడీలను నిర్బంధించారు. డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె కొనసాగుతుందని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు.

డోన్(రూరల్), జనవరి 21: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరసనదీక్షలు ఆదివారం 41వ రోజుకు చేరుకున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా తమ పోరాటం కొనసాగుతుందని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం చేపట్టిన నిరసన దీక్షలకు యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు సంఘీభావం తెలిపారు. సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా జగన్ ప్రభుత్వం పోలీసులతో నిర్బంధించినంత మాత్రాన ఉద్యమాలను ఆపలేరని, తమ హక్కులను సాదించుకునే తీరుతామని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం 41వ రోజు అంగన్‌వాడీల సమ్మె చేరుకుంది. అంగన్‌వాడీలు ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తుంటే.. ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల రైల్వేస్టేషన్లలో, ఆర్టీసీ బస్టాండులో, తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులతో అరెస్టు చేయించడం సిగ్గు చేటన్నారు. అంగన్‌వాడీలు నాగలక్ష్మి, గుల్జార్బీ, మాణిక్య వీణ, శోబారాణి, శివలక్ష్మి, లక్ష్మీదేవి, సంతోషమ్మ, లక్ష్మినారాయణమ్మ, విజయమణి, అంజినమ్మ, శివకుమారితో పాటు దాదాపు 50 మందికి పైగా అంగన్‌వాడీ వర్కర్లను పోలీసులు బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఉంచారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం సమ్మె చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఎన్ని రోజులైనా సమ్మె చేస్తామన్నారు.

చాగలమర్రి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించక పోవడం దారుణమని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఆదివారం చాగలమర్రి అంబేద్కర్ విగ్రహం ఎదుట రహదారిపై అంగన్‌వాడీలు, హెల్పర్లు, టీడీపీ నాయకులు బైఠాయించి నిరసన ప్రకటించారు. టీడీపీ నాయకులు వారికి సంఘీభావం ప్రకటించారు. టీడీపీ నాయకులు కొలిమి షబ్బీర్, సయ్యద్ బషీర్, నారాయణరెడ్డి, ఖాజా, షబీర్ పాల్గొన్నారు.

- చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చాగలమర్రిలో సమ్మె చేస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్టేషన్‌లో ఉంచారు. విజయవాడలో జరిగే సమ్మెకు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా ఏడుగురు అంగన్‌వాడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌లో ఉంచారు. సీఐటీయూ నాయకురాలు నాగమణి, పద్మావతి మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో తమను ఉంచినా సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదన్నారు.

రుద్రవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీలను పోలీసులు నిర్బంధించారు. 33 మందిని విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది ఆదివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. ఎస్ఐ వెంకటరెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తలను స్టేషన్‌కు పిలుపించి విజయవాడకు వెళ్లకుండా అదుపులోకి తీసుకున్నారు.

సంజామల: సంజామలలో అంగన్‌వాడీలు ఆదివారం సమ్మె చేపట్టారు. డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె కొనసాగుతుందని వారు అన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు ఆయాలు సోమవారం నుంచి విధులకు హాజరు అవుతున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆదివారం సమ్మె విరమించి స్వచ్ఛందంగా జాయిన్ అవుతున్నట్లు జాయినింగ్ రిపోర్టు ఇచ్చారన్నారు. దీంతో మండలంలోని 57 మంది అంగన్‌వాడీ వర్కర్లు విధులు హాజరు అవుతారన్నారు. మండలంలోని 29 అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తెరచుకుంటాయన్నారు.


రుద్రవరంలో పోలీసు నిర్బంధంలో అంగన్‌వాడీలు


దొర్నిపాడులో నిరసన


సంజామలలో..


కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్‌లో..

కోటకందుకూరులో ఉత్సవ పల్లకీ


కోటకందుకూరులో పూజలందుకుంటున్న అహోబిలేశుడు

ఆళ్లగడ్డ, జనవరి 21: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకీ ఆదివారం ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామానికి చేరుకుంది. గ్రామంలోని బస్టాండు వద్ద ఉన్న తెలుపు వద్ద పల్లకీ విడిది చేయడంతో ఆయా ప్రాంతాలలోని ప్రజలు మేళతాళాలతో వెళ్లి భక్తి, శ్రద్ధలతో పూజలు చేశారు.

రెండో రోజు సుందరకాండ పారాయణం

అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠ జరుగుతున్న శుభవేళ అహోబిలం లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణంలో రెండో రోజైన ఆదివారం వేదపండితులు సంక్షేప రామాయణ పారాయణం చేశారు. వేదపండితులు సుందర కాండలో 54వ సర్గ వరకు పారాయణం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

రుద్రవరం, జనవరి 21: మండలంలోని తువ్వపల్లె గ్రామానికి చెందిన బొప్పా రమణగౌడ్ కుమారుడు సాయికిరణ్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదివారం రాత్రి బొప్పా కుటుంబ సభ్యులను ఇంటికెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రంగనాయకులు, బొప్పా రమణ గౌడ్, బొప్ప యువరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం: మంత్రి


హుసేనాపురంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

ప్యాపిలి, జనవరి 21: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో రూ.18.5 కోట్లతో నిర్మించిన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని, గొర్రెల పెంపకం దార్ల శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, నాయకులు శ్రీరాములు, శ్రీరామిరెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, దిలీప్‌చక్రవర్తి, మహేశ్వరరెడ్డి, శ్యాంరెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

27న కళాశాలల ప్రారంభం

బేతంచెర్ల, జనవరి 21: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలో బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, ఐటీఐ కళాశాల, ఎంఎస్ఎం యూనిట్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయితీ ఛైర్మన్ సీహెచ్ చలంరెడ్డి తెలిపారు. ఆదివారం నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను వారు సూచించారు.

అన్ని రంగాలు సర్వ నాశనం: టీడీపీ


ఇందిరమ్మకు స్వాగతం పలుకుతున్న శివనందినగర్ కాలనీవాసులు

కొలిమిగుండ్ల, జనవరి 21: వైసీపీ పాలనలో అన్ని రంగాలు సర్వనాశనమయ్యాయని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె గ్రామాల్లోని వీదివీధిలోని ఇళ్లలోకి తిరిగి బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ కనకాద్రిపల్లె గ్రామంలో 2014 నుంచి 2019 వరకు రూ. 264 లక్షలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. నాయకులు ఐవీ ఫక్కీరారెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, వెంకట మల్లారెడ్డి, మూలే రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ బోయ శివశంకర్, తలారి ఓబులేసు, పెద్దిరెడ్డి, చిన్నపురెడ్డి, జయలక్ష్మిరెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, ఉపసర్పంచ్ రామ లక్ష్మన్న, అంబటి సాయిరెడ్డి, ఎంపీటీసీ పెద్దన్న, చిన్నరామిరెడ్డి, నల్లరామిరెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లె: అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ తెలిపారు. ఆది వారం బనగానపల్లె పట్టణంలోని శివనందినగర్‌లో బీసీ ఇందిరమ్మకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని శివనందినగర్‌లో బీసీ ఇందిరమ్మ బాబుష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు ఇంటింటింకి పంపిణీ చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బనగానపల్లె పట్టణంలోని అర్హులైన ఇళ్ళులేని నిరు పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇంటి పట్టాలు ఇస్తామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిరివెళ్ల: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాభివృద్ధి శూన్యమని యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా శిరివెళ్లలోని డేగలపేట, ముబారక్‌పేటలలో అయన ఆదివారం పర్యటించి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మురళి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఖాజా హుసేన్, బీఎండీ రఫి, నంద్యాల అబూబకర్ సిద్దిఖ్, బీసీ ఫిదా హుసేన్, నాలి వలి, పీపీ లింగమయ్య, బాలచంద్రుడు, రవి, సూరా శ్రీనివాసులు, యూనుస్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి


సుబ్బారెడ్డి, రాజశేఖర్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

బేతంచెర్ల, జనవరి 21: బీసీలకు ఎస్సీ ఎస్టీ దళిత వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం అన్ని, టీడీపీ హయాంలోనే న్యాయం జరిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కొలుములపల్లె గ్రామంలో నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బెస్త మల్లికార్జున, మండల బీసీ జయహో కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అరాచక పాలన చేస్తూ బీసీల వెన్ను విరిచే నాయకుడు సైకో సీఎం జగన్ కావాలా..? బీసీల వెన్నుతట్టి ప్రోత్సహించే నాయకుడు చంద్రబాబు కావాలా? అని ప్రజలను ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీల జీవితాలలో మార్పు తెచ్చిన ఘనుడు చంద్రబాబేనన్నారు. జగన్ పాలనలో పేరుకు మాత్రమే 56 బీసీ కార్పొరేషన్లు కానీ.. కార్పొరేషన్లలో నిధులు మాత్రం శూన్యమని అన్నారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అగ్రవర్ణాలందరూ కలిసి ఏకతాటిపైకి వచ్చి సైకో జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. టీడీపీ నాయకులు ఎల్ల నాగయ్య, ఉన్నం చంద్రశేఖర్, పోలూరు రాఘవరెడ్డి, ఎర్రమలనాయుడు, రమేష్, షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి, వడ్డె తిరుపాలు, వెంకటేష్, శ్రీరాములు, చంద్ర, పట్టణ టైలర్ రాముడు, రామనాథం, లోకేశ్ గౌడు, చంద్రశేఖర్, జాకీరుల్లాబేగ్, రవీంద్రనాయక్, మేకల నాగరాజు, కౌన్సిలర్లు రామాంజనేయులు, సర్పంచులు నాగరాజు, శ్రీనివాస్ యాదవ్, రామ్మూర్తి, శ్రీధర్, వెంకటప్పనాయుడు, జనసేన నాయకులు బట్టు చాముండేశ్వరి, చల్ల మద్దిలేటి, మధు, లాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక ఏకగ్రీవం


ఎన్నికైన దూదేకుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు

చాగలమర్రి, జనవరి 21: చాగలమర్రిలోని సీమాంధ్ర బీసీ సంక్షేమ కార్యాలయంలో ఆదివారం దూదేకుల నూర్‌బాషా సంక్షేమ సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా పీరయ్య, బాబయ్య, మండల అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షులుగా పెద్ద దస్తగిరి, పెద్దబాష జిలానీ బాషా, ఎన్.దస్తగిరి, కోశాధికారిగా లాల్‌బాషా, డి.దస్తగిరి, ప్రధాన కార్యదర్శిగా బి.మస్తాన్, కె.దస్తగిరి, యూత్ అధ్యక్షుడిగా ఇమామ్‌బాషా, ప్రచార కార్యదర్శిగా ఎస్.పక్రుద్దీన్, బాబు, కమిటీ ఇన్‌చార్జి లాల్‌బాషా, కన్వీనర్ సుబ్బరాయుడు, ఈసీ సభ్యులుగా లాల్ మోహిద్దీన్, ఖాశీం, కొండయ్య, మాబుషరీఫ్, చిన్న పీరయ్య, పూల పక్రుద్దీన్, చిన్న మస్తాన్, ఓబులేసు, పెద్ద పీరయ్య, మస్తాన్, బుజ్జి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను శాలువ, పూలమాలలతో సన్మానించారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

చాగలమర్రి, జనవరి 21: చాగలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి పండు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ దాదాపీర్ ఆదివారం తెలిపారు. గత నెల 19 నుంచి 20వ తేదీ వరకు నంద్యాల జిల్లా మిడుతూరులో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కోర్‌బాలో జరగబోయే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

చాగలమర్రి, జనవరి 21: మండలంలోని పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారుల సమక్షంలో ఆదివారం నిర్వహించారు. పోస్టర్ల ద్వార ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరించారు. మొబైల్ వాహనం ద్వార ప్రజలకు సంక్షేమ పథకాలపై తెలియజేశారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు


కొలిమిగుండ్లలో టీడీపీలో చేరిన కార్యకర్తలతో బీసీ జనార్దన్‌రెడ్డి


సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కొత్తకోట వైసీపీ కార్యకర్తలు

కొలిమిగుండ్ల, జనవరి 21: కొలిమిగుండ్లలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీకి చెందిన 65 కుటుంబాలు వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ దేవునికొండ సీతారామయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరాయి. కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. బీసీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. వైసీపీ నాయకులు ప్రజల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, భయబ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. చివరకు పేదల ఆస్తులు కూడా దౌర్జన్యంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. పోలీసులతో అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను వేధిస్తున్నారన్నారు. టీడీపీలో చేరుతున్న వారికి పించన్లు తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకునేది లేదన్నారు. మాజీ సర్పంచ్ సీతారామయ్యకు తాము అన్ని వేళలా అండదండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, టీడీపీ కన్వీనర్ మూలే రామేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, నంద్యాలనారాయణరెడ్డి, ఎల్ఐసీ చిన్నపురెడ్డి, బొట్టు స్వామి టైలర్ వెంకటరాముడు, కళ్యాణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయలక్ష్మిరెడ్డి, ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్: వైసీపీ అరాచక పాలన కొనసాగిస్తోందని, చరమగీతం పాడాలని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో కొత్తకోట గ్రామంలోని వైసీపీకి చెందిన 40 కుటుంబాలు సుబ్బారెడ్డి సమక్షంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వైసీపీ కార్యకర్తలు లక్ష్మన్న, మాధవకృష్ణ, వెంకటస్వామి, నాగార్జున, ఓబులేసు, రామాంజనేయులు, తిరుపాలు, పాండుతో పాటు 40 కుటుంబాల కార్యకర్తలు టీడీపీలో చేరారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, అరాచకాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. సీఎం జగన్ పాలనలో నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ విడుదల చేస్తానని మాట ఇచ్చి వైసీపీ మోసం చేశారని మండిపడ్డారు. వైసీపీ చెప్పే మాయమాటలను ఇక ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కావాలన్నా మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తేనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎల్ఐసీ శ్రీరాములు, రామ్మోహన్ యాదవ్, ధనుంజయ, పరుశరాముడు, పెద్ద వెంకటేశ్, రంగస్వామి, నాగేంద్ర, మల్లికార్జున, రమణయ్య, మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: కార్మికుడికి గాయాలు

అవుకు, జనవరి 21: మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలో నాపరాయి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో అవుకు పట్టణానికి చెందిన కార్మికుడు రవితేజ తీవ్రంగా గాయపడ్డారు. రామాపురం సమీపంలోని గనులనుంచి నాపరాళ్లను ట్రాక్టర్లలో లోడ్ చేసుకొని బనగానపల్లెకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. అన్నవరం మెట్ట వరకు వచ్చే సరికి వెనువస్తున్న లారీకి సైడ్ ఇచ్చే క్రమంలో ట్రాక్టర్‌ను రోడ్డుపక్కకు దించారు. రోడ్డు పక్కకు దిగిన టైర్ల వైపు డిస్కు క్రాక్ అవడంతో టైర్ ఊడి పక్కకు పడింది. ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీ రాళ్లపై కూర్చున్న కార్మికుడు రవితేజపై నాపరాళ్లు పడడంతో రెండు కాళ్లకు తీవ్రరక్తగాయాలయ్యాయి. 108 ద్వారా బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మెరుగైన చికిత్స కోసం కర్నూలు వైద్యశాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ యువజన నాయకుడి రాజీనామా

డోన్, జనవరి 21: మండలంలోని దేవరబండ గ్రామానికి చెందిన వైసీపీ యువజన నాయకుడు తుపాకుల లక్ష్మీనారాయణరెడ్డి పార్టీకి ఆదివారం రాజీనామా చేశారు. వైసీపీ ఆవిర్భావం నుంచి లక్ష్మీనారాయణ రెడ్డి పార్టీలో పని చేస్తూ వచ్చారు. పార్టీకి ఎంతో సేవ చేసినా గుర్తింపు లేదని అయన అసంతృప్తితో ఉన్నారు. కష్టపడే వారికి పార్టీలో ప్రాధాన్యత లేదని వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు లక్ష్మీనారాయణ రెడ్డి ప్రకటించారు.

చీరల పంపిణీ

బనగానపల్లె, జనవరి 21: మండలంలోని బీరవోలు గ్రామంలో అయోధ్యలో సోమవారం శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికి చీరలు, గాజులు, కుంకుమ పంపిణీ చేసే కార్యక్రమం రామలక్ష్మమ్మ, గురప్ప, కోమలి, శివప్రసాద్‌లు అందించిన రూ. లక్ష రూపాయల విరాళంతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని 600 ఇళ్లుఉండగా ఇంటింటికి వెళ్లి చీరలు పంపిణీ చేశారు. అలాగే గ్రామ పెద్దల సహకారంలో భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. గావించారు. సీతారామాంజనేయస్వామి భజన బృందం ఆధ్వర్యంలో భజనలు పాడుతూ వీధుల్లో తిరిగి ప్రచారం చేశారు.

'హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి'

బేతంచెర్ల, జనవరి 21: ప్రమాదాలకు డ్రైవర్లే కారణమంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిరంకుశమైన, దుర్మార్గమైన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు వైటీ వెంకటేశ్వర్లు, లారీ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు సాధిక్ హుశేన్, బి.రామాంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని లారీ వర్కర్స్ యూనియన్‌లో ఉపాధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన లారీ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ సదస్సు నిర్వహించారు. రవాణా రంగ కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆళ్లగడ్డలో గురువులతో పూర్వ విద్యార్థులు

రుద్రవరం, జనవరి 21: రుద్రవరం ఉన్నత పాఠశాలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. శర్మ, శ్రీనివాసరెడ్డి, క్రిష్ణారెడ్డి, శీనయ్య, శివ, ఓబుల్‌రెడ్డి, క్రిష్ణయ్య, రాజారామ్మోహన్, వర్మ, గోవిందు, అన్వర్, మాబు ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు 2004-05 విద్యాసంవత్సరంలో 110 మందికి గాను 80 మంది హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ వైపీపీఎం జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1985-87వ సంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థులు 36 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలిశారు. చదువు చెప్పిన గురువులు శంకరరెడ్డి, జానారత్నం, మునిస్వామి, వెంకయ్య, సుబ్బారెడ్డిని సన్మానించారు. పూర్వ విద్యార్థులైన జ్ఞాన దేవమణి, ఎస్ఎండి రఫిబాషా, అబ్దుల్ మాలిక్, మల్లేశ్వర్, జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ గంగన్న, హరిప్రసాదరెడ్డి, డేవిడ్, శేఖర్, భువనేశ్వరి, షాషావలి, రామలింగారెడ్డి, రామసుబ్బన్న పాల్గొన్నారు.


రుద్రవరంలో..